శుభాకాంక్షలు

కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం,మార్చి 9 : భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నివాసంలో కార్పొరేటర్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నేతలు వెంకట్‌రెడ్డి, సుధాకర్, రాకేశ్‌రెడ్డి, విజయ్, సాయి, రవి, శ్రీధర్ ఉన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం

హరీశ్‌రావును సన్మానిస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు

పటాన్‌చెరు, మార్చి 9 : పటాన్‌చెరులో మార్చి 11న నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి రావాలని మాజీ మంత్రి హరీశ్‌రావును మహిళలు ఆహ్వానించారు. ఆదివారం నగరంలోని హరీశ్‌రావు కార్యాలయంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, భారతీనగర్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, మహిళా కార్యకర్తలతో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు కార్పొరేటర్ సతీమణి రమా మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ మహిళా నాయకులు హరీశ్‌రావు ను ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పటాన్‌చెరులో మంగళవారం జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మకు బీఆర్ఎస్ నాయకుల పూజలు

గడ్డపోతారం కట్ట మైసమ్మ తల్లిని దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, వెంకటేశం గౌడ్

జిన్నారం మార్చి 9 : జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలో కట్ట మైసమ్మ తల్లి జాతర వైభవంగా కొనసాగుతున్నది. ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర యువత నాయకులు వెంకటేశం గౌడ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు రాజేశ్, ప్రభాకర్ రెడ్డి, శివరాజ్, ఆది రామకృష్ణ, కృష్ణ గౌడ్, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న గ్రామ మహిళలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చౌటకూర్, మార్చి 9 : మండల కేంద్రం చౌటకూర్‌లో 2006-07 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకొన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు గణపతి, కొల్కూరి లింగమయ్య, ప్రవీణ్, రాజు, కృష్ణాగౌడ్, శ్వేత, మధుసూదన్‌గౌడ్, మురళీ, నత్తి గోపాల్, మహిపాల్ పాల్గొన్నారు.

సదాశివపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1991-92 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులు శ్రీశైలం, ప్రభాకర్, అశోక్, పండరి, రుక్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

-సదాశివపేట, మార్చి 9

ఘనంగా మహిళా దినోత్సవం

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సరళ కుమారి పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థిక రాజకీయ సామాజిక రంగాల్లో అభివృద్ధి చెంది పురుషులతో సమానంగా రాణించాలని సూచించారు.

-అమీన్‌పూర్, మార్చి 9

గ్రామ పంచాయతీలకు నిధుల కటకట !

- కుప్పలు తెప్పలుగా పెరిగిపోతున్న సమస్యలు
- కుంటుపడుతున్న అభివృద్ధి పనులు
- తమ వల్ల కాదంటూ చేతులెత్తేస్తున్న పంచాయతీ కార్యదర్శులు
- ఇబ్బందులకు గురవుతున్న ఆయా గ్రామీణ ప్రజలు

జహీరాబాద్, మార్చి 9 : పంచాయతీలకు నిధుల కొరత కారణంగా గ్రామాల్లో సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఇంతకాలం చిన్న చిన్న ఖర్చులు జేబుల్లో నుంచి వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు.. తమ వల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని 170 గ్రామాల్లో వీధి దీపాలు వెలుగక పోయిన, బోరు పనిచేయకపోయిన, ట్రాక్టర్లలో డీజిల్ లేకపోయిన వాటి ఫలితం ప్రజలు అనుభవించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతకాలం కార్యదర్శులు సొంతంగా వెచ్చించిన డబ్బులు తిరిగి రాకపోగా, నగదు చెల్లించకకుండా సామగ్రి ఇచ్చేందుకు దుకాణాల నిర్వాహకులు నిరాకరిస్తుండడంతోఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం మంజూరు చేసే 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం లేదు. గ్రామ పంచాయతీ పాలక వర్గాలు లేనందున నిధులను విడుదల చేయలేమంటూ కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఎన్నికలు నిర్వహించించి ఉంటే కేంద్ర పంచాయతీలకు నిధులను విడుదలై ఉండేవి. పంచాయతీ పాలక వర్గాల గడువు దాదాపు రెండేండ్లు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించడంలో తాత్సారం చేస్తుంది. పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసిన తర్వాత అసెంబ్లీ, పార్లమెంట్, పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చాయి. ఫలితంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ జరగకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు అటంకం ఏర్పడింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తేనే 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తామని కేంద్రం లింకు పెట్టడడంతో ఆనిధులపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వీటికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ కింద పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీలకు

రేజింతల్‌లో నిధుల కొరతతో మరమ్మతులకు నోచుకొని సింగిల్ ఫేజ్ పంపు సెట్టు

నిధుల కొరత తీవ్రరూపం దాల్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను విడుదల చేయక పోవడం వల్ల సొంతంగా గ్రామ పంచాయతీలు జమ చేసుకున్న ఫండ్‌ను కూడా విని యోగించుకోలేని ధీనమైన పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామ పంచాయతీల్లో ఇంటి, వ్యాపారాలు తదితర పన్నులను వసూలు చేసి ట్రేజరీల ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తారు. ఆ నిధులను అవసరమైనప్పుడు కార్యదర్శులు చెక్కులు డిపాజిట్ చేయడం ద్వారా తిరిగి డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఆగస్టు 2024 నుంచి జనరల్ ఫండ్ నిధులను విడుదల కావడం లేదని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఒక వైపు కేంద్రం, మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోగా, తాము వసూలు చేసి డిపాజిట్ చేసిన సొమ్ము ఫ్రీజ్ కావడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. పంచాయతీ పాలక వర్గం ముగిసిన ప్పట్టి నుంచి రోజువారి పారిశుధ్యం, ట్రాక్టర్లలో డీజిల్ పొయించడం, వాటికి మరమ్మతులు, బ్లీచింగ్, బయోటెక్స్, ఫాగింగ్, రక్షిత మంచి నీటి పంపు సెట్ల మరమ్మతులు తదితర వాటి కోసం దుకాణాల్లో ఖాతాలు పెట్టామని, మళ్లీ సామగ్రిని ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే క్లియర్ చేయించడంతో పాటు ట్రేజరీకి అనుసంధానం లేకుండా నేరుగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇటీవల జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండల అభివృద్ధి అధికారులకు సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రాలను అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో సమస్యలు జఠిలం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలని మొగుడంపల్లి మండల అభివృద్ధి అధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్

జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

జహీరాబాద్, మార్చి 9 : ఎన్నికలకు ముందు ఎల్ఆర్ఎస్‌ను ఫ్రీగాచేస్తామని చెప్పి ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే మాట తప్పారని జహీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ మండిపడ్డారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎల్ఆర్ఎస్‌పై అధికారంలోకి రాకముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని ప్రకటించి, ఇప్పుడు ఈ నెల 31వ తేదీలోగా డబ్బులు కడితే 25శాతం రిబేట్‌ను ఇస్తామనడం ఏమిటని ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు ఫ్రీగా చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం రిబేట్ ఇస్తామని చెప్పడం ముమ్మాటికీ ప్రజలకు మోసం చేయడమేన్నారు. ఆరుగ్యారెంటీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పుడు ఎల్ఆర్ఎస్‌పై మాట్లాడుతున్న తీరు పట్ల ప్రజలు ఆయోమయానికి గురవుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ గతంలో ప్రకటించిన మాదిరిగానే ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు యాకూబ్, బండిమోహన్, శివప్ప, అప్పీరాజ్ పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, మార్చి 9 : జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో అనధికార లేఅవుట్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఉమమహేశ్వర్‌రావు సూచించారు. ఎల్ఆర్ఎస్ కోసం మన్సిపల్ పరిధిలో 9,944 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు.ఎల్ఆర్ఎస్‌ను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం కొన్ని కొత్త నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎల్ఆర్ఎస్ స్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుం చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. ఈ నెల 31లోగా క్రమబద్ధీకరణ చేసుకోవాల్సిన రుసుంలో 25 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

వట్‌పల్లి మండల పరిధిలోని సాయిపేటలో నూతనంగా నిర్మించిన బీరప్ప విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానినకి ముఖ్య అతిథిగా రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. మండల నాయకులు బస్వారాజు, శివాజీరావు, మల్లేశం, సంగన్న, గోపాల్, మొగులయ్య, రమేశ్, శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

-వట్‌పల్లి, మార్చి 9

వైష్ణవి బృందానికి ప్రశంస

వైష్ణవి బృందాన్ని ప్రశంసిస్తున్న ఒడిశా యూనివర్సిటీ

వర్గల్, మార్చి 9 : ఒడిశా రాష్ట్రంలోని బరంపుర యూనివర్సిటీలో జరుగుతున్న 7 రోజుల ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపు ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్గల్ మహాత్మాజ్యోతిబా పూలే వెనుకబడిన బాలికల గురుకుల కళాశాలకు చెందిన ఎంపీసీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వైష్ణవి నేతృత్వంలోని విద్యార్థిని బృందం ప్రదర్శించింది. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మఆట పోతరాజుల విన్యాసాలకు అక్కడి యూనివర్సిటీ వారు జేజేలు పలకడమేకాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థినులు ప్రదర్శించిన ప్రదర్శనలకంటే వర్గల్ ఎంజేపీటీకి మొదటి స్థానం దక్కడంపై కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు సంతోషం వ్యక్తంచేశారు.

నక్కవాగు బారి నుంచి మంజీరా నదిని కాపాడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్యం

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్యం

చౌటకూర్, మార్చి 9 : నక్కవాగు బారి నుంచి మంజీరా నదిని కాపాడి, కలుషిత జలాల విముక్తి నుంచి ప్రజలను రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్యం కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఆయన చౌటకూర్ మండలం లింగంపల్లిలో ఆదివారం పర్యటించారు. ముందుగా గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి చేరువలో ఉన్న మంజీరా నదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌటకూర్ మండలంలోని శివంపేట, వెండికోలు, లింగంపల్లి, కోర్పోలు, సరాఫ్‌పల్లి, చౌటకూర్ తదితర గ్రామాల ప్రజలు మంజీరా జలాలపై ఆధారపడి జీవనం వెళ్లదీస్తున్నారని తెలిపారు. స్వచ్ఛమైన మంజీరా జలాలు నేడు నక్కవాగు నుంచిసరఫరా అవుతున్న కలుషిత నీరు బారిన పడి మంజీరా జలాలు సైతం పూర్తిగా కలుషితమై ప్రజా అవసరాలకు వినియోగించలేని దుస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పటాన్‌చెరు, ఇస్నాపూర్, పాశమైలారం, చిట్కుల్, ముత్తంగి, గుండ్ల మాచనూరు తదితర ప్రాంతాల నుంచి ప్రవహించే నక్కవాగులోకి ఆప్రాంతంలోని పరిశ్రమల వ్యర్థ జలాలు నక్కవాగులోకి ప్రవేశించి మంజీరా జలాలను కలుషితం చేస్తున్నాయన్నారు. వెండికోలు వద్ద మంజీరా నదిలో కలిసి నదిని పూర్తిగా కలుషితం చేస్తూ, కనీసం పశువులు సైతం తాగలేని పరిస్థితి తయారైందని విచారం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతీ రైతుకు రూ. 2 లక్షలు పంట రుణమాఫీ చేసి బ్యాంకుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం అధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. సీపీఎం నాయకులు నాగభూషణం, ప్రజా సంఘాల నాయకులు రాజు, శ్రీహరి, సురేశ్, రైతులు దుర్గయ్య, పోచయ్య, కిష్టయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు సరుకులు పంపిణీ

ముస్లింలకు సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

సదాశివపేట, మార్చి 9 : రంజాన్ పురస్కరించుకుని సదాశివపేట సొసైటీ-1 అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు సరుకులను పంపిణీ చేశారు. ప్రతి ఏడాది తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వంద మంది ముస్లింలకు రంజాన్ తోఫాలో సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. 25 కిలోల బియ్యం, ఐదు కిలోల గోదుమపిండి, చెక్కర, మంచినూనె, రెండు కిలోల శనగపప్పు, కందిపప్పు ముస్లింలకు అందజేశామన్నారు.

సంతకం పోర్జరీ

మాజీ సర్పంచ్ పొన్నబోయిన మమత ఆరోపణ

సంతకం పోర్జరీ చేశారని జేఏసీ నాయకులకు వెల్లడిస్తున్న మాజీ సర్పంచ్ మమత

గుమ్మడిదల, మార్చి 9 : 2021 నవంబర్ 21న సంగారెడ్డిలో అదనపు కలెక్టర్ రాజర్షిషా, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి పిరంగి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో జరిగిన సమావేశానికి తాను హాజరుకాలేదని గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం మాజీ సర్పంచ్ మమత తెలిపారు. ఈ సమావేశం లో ప్యారానగర్ సమీపంలో డంపింగ్‌యార్డు రోడ్డు కోసం జీహెచ్ఎంసీ అధికారులు జిల్లా స్థాయి అధికారులతో ప్యారానగర్ అటవీప్రాంతం నుంచి రోడ్డు వేయడానికి సమావేశాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలియదని, నాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని అన్నారు. ఇందులో డంపింగ్‌యార్డు మున్సిపల్ సాలిడ్ వేస్ట్ (ఎంఎస్‌డబ్ల్యూ)ట్రీట్‌మెంట్ అండ్ డిస్పోజల్ ఫెసిలిటీ కోసం కేటాయించిన డంపింగ్‌యార్డు కోసం అటవీ ప్రాంతం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు చేశారు. ఇందులో జిల్లా స్థాయి అధికారులతో పాటు జిల్లాలోని మూడు గ్రామపంచాయతీలైన హత్నూర మండలంలోని చెక్‌మద్దూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం సర్పంచ్ మమత, పుల్కల్ మండలంలోని బొమ్మరెడ్డి గూడెం సర్పంచ్ మమతలతో జిల్లా అదనపు కలెక్టర్ రాజార్షిషా, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి పిరంగిలతో ఆరుగురి కమిటీ వేశారు. ఇందులో డంపింగ్ యార్డు కోసం రోడ్డు ప్రతిపాదనల కోసం తీర్మానం చేసినట్లు ఫేక్ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించారన్నారు. తాను ఆ సమావేశం ఉందని తెలియదు. ఆ సమావేశానికి హాజరు కాలేదు. అయినా నేను సంతకం చేసినట్లు కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. సంతకం ఫోర్జరీ చేసి తన వ్యక్తిత్వాన్ని అగౌరవపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కోర్టుకు వెళ్లనున్నట్లు మాజీ సర్పంచ్ మమత స్పష్టం చేశారు. ఇది పూర్తిగా పోర్జరీ సంతకమని గుమ్మడిదల జేఏసీ నాయకులకు తెలిపారు. న్యాయవాది సలహామేరకు సంతకం పోర్జరీ అని కోర్టుకు ఆశ్రయించనున్నట్లు తెలిపారు. డంపింగ్‌యార్డు వద్దని 2024 జనవరి 23న 13 గ్రామపంచాయతీలతో పాటు వీరన్నగూడెం తరపున ఏకవాక్య తీర్మానం చేసినట్లు గుర్తు చేశారు.

ముమ్మరంగా ఫాగింగ్ పనులు

వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

జిన్నారం మార్చి 9 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 1, 12 వార్డుల్లో దోమల నియంత్రణ చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది వాహనాలపై యంత్రాలతో ఫాగింగ్ చేశారు. ముఖ్యంగా దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఫాగింగ్ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పారిశుధ్య కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

కూచిపుడిలో చిన్నారి ప్రతిభ

అందోల్ : చిన్నారి అనుపమకు జ్ఞాపికను అందజేసి సన్మానిస్తున్న దైవాజ్ఞశర్మ

అందోల్, మార్చి 9 : జోగిపేటకు చెందిన చిన్నారి అనుపమ కూచిపుడి నృత్యంలో ఉత్తమ ప్రతిభను చాటి పలువురు ప్రముఖులతో ప్రశంసలు పొందింది. విసన్ నేషనల్ బుక్‌ఆఫ్ రికార్డ్స్ ద్వారా రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలో చిన్నారి చక్కటి ప్రతిభను చాటగా, తెలంగాణ భాషా, సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దైవాజ్ఞశర్మ అనుపమను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. నాట్య గురువు గీతయజ్ఞశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంబురాలు

విద్యార్థులను అభినందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, మార్చి 9 : మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు వార్డులో గల సెంట్ డాన్ బాస్కోహైస్కూల్‌లో నౌబా వార్షికోత్సవ సంబురాలు అలరించాయి. డైరెక్టర్లు స్వరూప్‌రెడ్డి, వెంకట్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించగా, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, మాజీ సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ అభిశెట్టి నారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. హైస్కూల్ డన్ సునంద, ప్రిన్సిపాల్ క్రిస్టియానే, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి దేవాలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

గుమ్మడిదల, మార్చి 9 : జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఈవో శశిధశర్‌గుప్తా తెలిపారు. ఉదయం 10.30 గంటల సమయంలో దేవాదాయధర్మకర్తల అధికారుల సమక్షంలో 11 మంది భక్తులతో ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం ఉంటుందన్నారు. ఇందులో ధర్మకర్తలుగా అన్నారం గ్రామానికి చెందిన మద్దీ ప్రతాప్ రెడ్డి, ధర్మకర్తలుగా యాదగిరిగౌడ్, ఎం. వీరస్వామి, ఎం.శ్రీనివాస్‌గౌడ్, టీ.బజ్‌రంగ్‌సింగ్, పీ.రాజు, పూజారి కృష్ణ, జీ. కోటేశ్వర్‌గౌడ్, వీ.భాస్కర్‌గౌడ్, యూ.అశోక్, ప్రధాన పూజారి శివనాగులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. అనంతరం చైర్మన్ ఎన్నిక ఉంటుందన్నారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి భక్తులు, అన్ని పార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా ముగిసిన విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు

హత్నూరలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి మాధవానంద సరస్వతీ స్వామిజీ హాజరై పూజలు నిర్వహించారు.

-హత్నూర, మార్చి 9

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

బెజ్జంకి, మార్చి 9 : దివ్యాంగుల సమస్యలు పరిష్కంచాలని దివ్యాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిట్యాల సంపత్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం సమావేశాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సమష్టిగా పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్యామసుందర్, తదితరులు పాల్గొన్నారు.